రాజ్యసంక్రమణవాది.. డల్హౌసీ!

వ్యాపారం కోసం వచ్చిన ఆంగ్లేయులు... క్రమేణా భారత్‌పై ఆధిపత్యం సాధించారు. డల్హౌసీ కాలంనాటికి యావత్ భారతదేశాన్ని తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. కొంత అనైక్యత .. మరికొంత స్వార్థం.. ఇంకొంత సమాచార లోపం.. అన్నిటికీ మించి కర్మసిద్ధాంతం.. వెరసి మనల్ని బ్రిటిష్ వాళ్లకు దాసోహం చేశాయి!


కారన్ వాలీస్ తర్వాత మరోముఖ్య గవర్నర్ జనరల్ వెల్లస్లీ. ఇతని పేరు చెప్పగానే మనకు గుర్తుకు వచ్చేది సైన్యసహకార పద్ధతి. కంపెనీ ప్రభుత్వానికి స్వదే శీ సంస్థానాలు సహకరించే ఉద్దేశంతో అతను సైన్యసహకార పద్ధతిని ప్రవేశపెట్టాడు. ఇందులో అనేక నియమని బంధనలు ఉన్నాయి. వీటిని అనుసరించి స్వదేశీ సంస్థానాధీశులు తమ సంస్థానాల రక్షణకోసం కంపెనీ సైన్యాలను, బ్రిటిష్ రెసిడెంట్‌ను ఆయా రాజ్యాలలో ఉండనీయాలి. కంపెనీ సైన్యం పోషణను ఆయా సంస్థానాధీశులే భరించాలి.

వెల్లస్లీ అసలు ఉద్దేశం:

వాస్తవానికి సైన్యసహకార పద్ధతిని ప్రవేశపెట్టడం వెనుక విదేశీ భయం దాగి ఉంది. భారత్‌పై ఆధిపత్యం కోసం ఫ్రెంచ్ వారు మళ్లీ వస్తారనే వాదన అప్పట్లో బలంగా ఉండేది. అలా జరగకుండా అడ్డుకునేందకు వెల్లస్లీ సైన్యసహకార పద్ధతిని ముందుకు తెచ్చాడు. దీనిపై సంతకాలు చేసిన స్వదేశీ సంస్థానాధీశులు.. ఏ ఇతర ఐరోపా వారితోనూ... ముఖ్యంగా ఫ్రెంచి వారితో ఎలాంటి ప్రత్యక్ష సంబంధాలు పెట్టుకోరాదు. వారి ప్రతి విదేశీ వ్యవహారం బ్రిటిష్ రెసిడెంట్ ద్వారానే నడుపుకోవాలి. తమ రాజ్యాలలో అంతరంగిక కలహాలను, విదేశీ దాడులను నివారించే బాధ్యత కంపెనీ ప్రభుత్వం స్వీకరిస్తుంది.

తొలి సంతకం నిజాందే:

సైన్య సహకార పద్ధతిపై సంతకం చేసిన మొట్టమొదటి సంస్థానాధీశుడు హైదరాబాద్ నిజాం నవాబు అలీఖాన్. 1800 అక్టోబరు 12న సైన్య సహకార పద్ధతి కింద కడప, బళ్లారి, అనంతపూర్, చిత్తూర్‌లను నిజాం నవాబు కంపెనీకి దత్తత చేశాడు. అందువల్లే వాటిని సీడెడ్ లేదా దత్తమండలాలు అంటారు. హైదరాబాద్, మైసూర్, అయోధ్య, పుణె, నాగపూర్, గ్వాలియర్ సంస్థానాలు సైన్యసహకార పద్ధతికి అంగీకరించాయి. మైసూర్ పాలకుడు కృష్ణరాజు ఒడయార్.. సైన్యసహకార పద్ధతికి అంగీకరించి.. కెనరా, మైసూర్, కోయంబత్తూర్‌లను కంపెనీకి ఇచ్చాడు.



ఓడిన సింధియాలు:

రెండో మహారాష్ట్ర యుద్ధంలో భోంస్లే, సింధియాలను వెల్లస్లీ ఓడించాడు. దాంతో భోంస్లేలు బాలసోర్, కటక్, మహానదీ లోయను కంపెనీకి దత్తం చేశారు. సింధియాలు.. ఢిల్లీ, ఆగ్రాలతోసహా యమున – గంగా మైదానాన్ని కంపెనీకి ఇచ్చేశారు. 1799లో తంజావూరు, 1800 లో సూరత్, 1807లో ఆర్కాట్, 1802లో ఫరూకాబాద్ పాలకులను లొంగదీసుకొని వారికి పెన్షన్ ఏర్పాట్లు చేశాడు వెల్లస్లీ.

హేస్టింగ్స్– శాంతిభద్రతలు:

లార్డ్ హేస్టింగ్స్.. భారతదేశంలో ఇతని కాలంలో శాంతిభద్రతల సమస్య ఎక్కువగా ఉండేది. మహారాష్ట్రులు, పిండారీలు, పఠానుల దోపిడీల వల్ల మధ్య భారత్, రాజస్థాన్‌లలో అరాచక పరిస్థితి నెలకొంది. పిండారీలను అణచివేయడం హేస్టింగ్స్‌కు మంచి పేరు తెచ్చిపెట్టింది. నాగపూర్, ఉదయపూర్, జయపూర్, భోపాల్‌లలోని పాలకులందరిని ఒక ఒడంబడికకు ఒప్పించి పిండారీలను అణచేశాడు వెల్లస్లీ. మహారాష్ట్రులను బలహీనం చేసింది కూడా ఆయనే. మూడో మహారాష్ట్ర యుద్ధంలో.. పీష్వాలను, భోంస్లేలను, హోల్కారులనూ ఓడించాడు. మహారాష్ట్రను దాదాపుగా తన చేతుల్లోకి తీసుకున్నాడు. మహారాష్ట్రుల ముఖ్యమైన పాలనా పదవి షీష్వాను రద్దు చేసింది కూడా హేస్టింగ్సే కావడం విశేషం!

డల్హౌసీ–రాజ్యసంక్రమణ సిద్ధాంతం:

ఆంగ్లేయుల సామ్రాజ్యవాదాన్ని భారతదేశమంతా వ్యాప్తి చేసింది లార్డ్ డల్హౌసీ. ఇతను ఏకంగా స్వదేశీ సంస్థానాలను ప్రత్యక్షంగానే ఆక్రమించుకోవడం ఆరంభించాడు. దానికి ఇతను పెట్టిన పేరు రాజ్య సంక్రమణ సిద్ధాంతం లేదా నిర్‌వారసత్వ విధానం లేదా దత్తస్వీకార నిరాకరణ పద్ధతి. స్వదేశీ సంస్థానాధీశులు.. వారసులు లేకుండా మరణిస్తే.. ఆ సంస్థానాలు బ్రిటిష్ సామ్రాజ్యంలో కలిపేస్తారు. స్వదేశీ సంస్థానా టదీశుల దత్తపుత్రులను వారి వారసులుగా స్వీకరించేందుకు అంగీకరిం చలేదు. రాజ్య సంక్రమణ సిద్ధాంతం డల్హౌసీ కొత్తగా ప్రవేశ పెట్టింది కాదు. అది మొగల్ చక్రవర్తి ఔరంగజేబు కాలం నుంచే ఉంది. దీన్ని ఔరంగజేబు, మేవార్ రాజపుత్ర పాలకుడు జశ్వంత్

సింగ్‌పై ప్రయోగించాడు.

సతార..జయ్‌పూర్.. సంబల్‌పూర్:

1848లో రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని అమలు చేసి, డల్హౌసీ మొట్ట మొదటిగా ఆక్రమించుకున్న ప్రాంతం సతార. ఆ తర్వాత జయ్‌పూర్, సంబల్‌పూర్, ఉదయ్‌పూర్, ఝాన్సీలను ఆక్రమించుకున్నాడు. పరిపాలన సరిగ్గా లేదనే నెపంపై 1856లో అయోధ్యను కలిపేసుకున్నాడు. అయోధ్య నవాబు వాజిద్ అలీషాకు 12 మంది సంతానం. ఇక్కడ రాజ్యసంక్రమణ సిద్ధాంతం అమలు చేయడానికి కుదరదు. దాంతో పాలన సరిగా లేదనే సాకుతో ఆక్రమించుకున్నాడు. ఆంగ్లేయులు అయోధ్యపై అంతంగా ఆసక్తి చూపడానికి కారణం.. అది వారికి పాడి ఆవు లాంటిది. ఆంగ్లేయుల వస్త్రప్రపంచ మార్కెట్‌కి ఎంతో కీలకం. అప్పట్లో ఆంగ్లేయుల సైన్యంలో భారతీయుల సంఖ్య లక్ష నలభై మూడు వేల మంది కాగా.. అందులో సింహభాగం అయోధ్యకు చెందిన వారే. 1857 నాటి సిపాయిల తిరుగుబాటు లో వారు కీలక పాత్ర పోషించారు.

రైలు- ఇనుప రాక్షసి:

దేశాన్నంతా తన గుప్పిట్లోకి తీసుకోవటానికి డల్‌హౌసీ చేయని ప్రయత్నంలేదు. అతను అనుసరించిన రాజ్యసంక్రమణ సిద్ధాంతం,1856లో అయోధ్యను ఆక్రమించుకున్న తీరు సంచలనం సృష్టించింది.అయితే, అతనిలో కొంత మానవీయ కోణం కూడా ఉంది. జైళ్లలోని ఖైదీల్లో సమానత్వం పెంచటానికి సహపంక్తి భోజనాలు ప్రవేశ పెట్టాడు. దేశంలో రైల్వే, తంతి-తపాల ఇతని కాలంలోనే ప్రవేశపెట్టారు. 1853 లో బొంబాయి నుంచి థాణెకు మొదటి రైలు మార్గం వేశారు. రైలును తొలిదశలో ఇనుప రాక్షసి అనేవారు.

రైలు మార్గాన్ని ఇనుప మార్గం అనేవారు. ఆంగ్లేయులు భారత సంపద కొల్లగొట్టడానికి ఈ ఇనుప రాక్షసి ఉపయోగ పడింది. మొదట వేసిన రైలు మార్గలన్నీ నౌకాశ్రయా లను కలుపుతూ వేశారు.

విద్యా సంస్కరణలు:

డల్హౌసీ భారత్‌లో విద్యా సంస్కరణలు కూడా ప్రవేశ పెట్టాడు. 1854 లో చార్లెస్ ఉడ్స్ విద్యా నివేదిక రూపొందింది. దీనినే భారతీ విద్యా హక్కుల పత్రం అంటారు. దీని ప్రకారమే స్కూల్ ఇన్‌స్పెక్టర్ వ్యవస్థ, బొంబాయి, కలకత్తా, మద్రాస్‌లలో తొలిసారిగా విశ్వవిద్యాలయాలు ఏర్పాటయ్యాయి. ఇవి లార్డ్ కానింగ్ కాలం నుంచి పనిచేయడం ప్రారంభించాయి. వీటిలో తొలుత కలకత్తా విశ్వవిద్యాలయం ఆరంభమైంది. కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి మొట్టమొదటిగా పట్టభద్రుడైన భారతీయుడు బంకిం చంద్రచటర్జీ. డల్హౌసీ ప్రవేశపెట్టిన సంస్కరణల్లో కొన్ని ఆంగ్లేయులకు ఉపయోగపడగా.. మరికొన్ని 1857నాటి సిపాయిల తిరుగుబాటుకు దారితీశాయి.

సిపాయిల తిరుగుబాటు:

1600 డిసెంబర్ 31న ఏర్పాటైన ఈస్టిండియా కంపెనీ... 1757 ప్లాసీయుద్ధంతో బెంగాల్‌లో రాజ్యాధికారాన్ని సుస్థిరం చేసుకొంది. అనంతరం వందేళ్లకు 1857లో సిపాయిల తిరుగుబాటు జరిగింది. సిపాయిల తిరుగుబాటు 1857లోనే ఎందుకు జరిగిందనేది ప్రశ్న? అప్పుడే భారత సిపాయిలకు అంత ధైర్యం ఎలా వచ్చింది? వీటికి సమాధానం... 1856లో ఐరోపాలో రష్యా-ఇంగ్లండ్ మధ్య జరిగిన క్రిమియావార్. నల్ల సముద్రంలో ఉండే నౌకాస్థావరం క్రిమియా. దీనిపై ఆధిపత్యం కోసం రష్యాపై గెలిచేందుకు ఇంగ్లండ్,భారత్‌లో ఉన్న తమ ఆంగ్ల సైన్యాన్ని యూరప్‌కు తరలించింది. దాంతో ఇక్కడ మన సిపాయిల శాతం ఎక్కువగా ఉండటం, ఆయుధాలు, మందు గుండు సామగ్రి అందుబాటులో ఉండటం.. 1857లోనే సిపాయిల తిరుగుబాటుకు కారణాలయ్యాయి. 1857, మే 31 నుంచి సిపాయిల తిరుగుబాటుకు స్వామి విరజానంద మధురలో తీర్మానం చేశారు. సిపాయిలు, అసంతృప్తివాదులు అందరూ కలసికట్టుగా రావాలని ఆయన పిలుపునిచ్చారు. స్వామి విరజానంద 1857, మే 31ని ముహూర్తంగా నిర్ణయించగా.. విచిత్రంగా సిపాయిల తిరుగుబాటు 1857, మే 10నే మీరట్‌లో ప్రారంభమైంది!!